ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

మంగళవారం 5 నవంబరు 2024 | 5





వీరేశ్వరస్వామికి అభిషేకం

భీమేశ్వరాలయంలో పూజలు



భీమేశ్వరాలయంలో క్యూలో భక్తులు



ద్రాక్షారామ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి తొలికార్తీక సోమవారం భక్తులు తరలివచ్చారు. ఓం నమఃశ్శివాయ అంటూ పంచాక్షరి నామాన్ని తన్మయత్వంతో జపించారు. భీమేశ్వరునికి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు రాకపోకలు మొదలయింది. క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు సప్తగోదావరి, అశ్వత్థనారాయణ వృక్షం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. పంచారామ క్షేత్రాల బస్సులలో తరలివచ్చిన భక్తులు రాత్రి వరకు స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులకు సేట్‌గోపీ ఆధ్వర్యంలో ఆలయంలో అన్నదానం జరిపారు. పైండా వారి అన్నసత్రంలో యథావిధిగా అన్నదానం జరిగింది. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ పర్యవేక్షణలో ఆలయాల సిబ్బంది సేవలు అందించారు. సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మండపేట శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు సతీసమేతంగా ఆలయాన్ని సందర్శించారు.

'కోటిపల్లి' కిటకిట



కె.గంగవరం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభో శంకర అంటూ శివనామస్మరణతో కోటిపల్లి పుణ్యక్షేత్రం హోరెత్తింది. కార్తీకమాసం మొదటి సోమవారం భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఛాయాసోమేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో భీమశంకరం సుభాష్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. బేడా మండపంలో వేదాశీర్వాదం అందజేశారు. గ్రామానికి చెందిన దర్బా సూర్యనారాయణశర్మ ఆలయానికి వచ్చిన భక్తులు ఉచిత పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయంలో ఐనాపురం గ్రామానికి చెందిన వంక వెంకటసుబ్బారాయుడు పేరున లక్ష బిల్వార్చన నిర్వహించారు.

మురమళ్ల వీరేశ్వరస్వామికి పూజలు

అధిక సంఖ్యలో భక్తుల రాక

ఐ.పోలవరం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాస సోమవారం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శివనామ స్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచి భక్తులు పవిత్ర గోదావరిలో స్నానమాచరించి వీరేశ్వరుని దర్శనం కోసం తరలివచ్చారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక అభిషేక మండపాలు ఏర్పాటు చేశారు. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతల సహకారంతో అన్నసమారాధన జరిగింది. భక్తులకు ఉచిత ప్రసాదం అందించారు. ఆలయ అర్చకుడు యనమంద్ర సుబ్బారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కేశనకుర్రుపాలెం, ఐ.పోలవరం, ఎదుర్లంక, గుత్తెనదీవి, భైరవపాలెం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పథకాల అమలు తీరుపై నివేదికలు సిద్ధం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా మండలి సమావేశానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆయా శాఖల కార్యకలాపాలు, పథకాల అమలు తీరుపై స్పష్టమైన నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీక్షా మండలి సమావేశ నిర్వహణపై ఆయన ముందస్తు సమీక్ష నిర్వహించారు. జలవనరుల శాఖ కార్యక్రమాలపై సమీక్షించి ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగునీరు పంపిణీ, మరమ్మతు పనులు, నిధుల వినియోగం, పూడికతీత పనుల అంశాలపై సమీక్షించారు. వ్యవసాయ శాఖ రెండు సీజన్లలో సాగు విస్తీర్ణం, విత్తనాలు, ఎరువుల సరఫరా, పంట రుణాల కల్పన వంటి కార్యకలాపాలపై నియోజకవర్గాల వారీగా నివేదికలను సిద్ధం చేయాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి మెరుగైన ప్రయోజనాలు పొందే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు 15 శాతం వృద్ధి రేటు సాధన వంటి అంశాలపై చర్చించారు. అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌లు, సీఆర్‌జెడ్ పరిధిలోని అంశాలపై మ్యాప్‌లతో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి బీవీ రమణ, గనులు, భూగర్భశాఖ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత, కోఆర్డినేటర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా సమీక్షా మండలి సమావేశం

మంత్రి అచ్చెన్నాయుడు రాక

అమలాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా మండలి సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరు కానున్నారు. పర్యటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ కరెన్సీ నగర్ నుంచి ఉదయం 7.40 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరతారు. 10.20 గంటలకు అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకుంటారు. అక్కడ జరిగే ఎన్డీఏ కూటమి నేతల సమావేశంలో 11.20 గంటల వరకు పాల్గొంటారు. అనంతరం 11.45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే డీడీఆర్సీ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొంటారు.

మాటల్లేవ్..చేతలే!



ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా..

- పిఠాపురం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- మోడల్ నియోజకవర్గంగా చేస్తా
- సమస్యలు నా దృష్టికి తీసుకురండి
- గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్
- పిఠాపురంలో సుడిగాలి పర్యటన

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'అన్నిరంగాల్లో పిఠాపురాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నాం. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మాటలు కాదు.. చేతల్లో చేసి చూపిస్తున్నా.. ఎన్నికల ముందు మీకు ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలను మిగిలిన నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు చూసి ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తా..' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రకటించారు.



మధ్యాహ్నం వచ్చారు.. సాయంత్రం వెళ్లారు!

పిఠాపురం శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తొలిసారి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనల్లో పాల్గొన్నారు. మండల కేంద్రాలైన గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లిల్లో సుడిగాలి పర్యటన జరిపారు. దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వివిధ వర్గాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలపై స్పందించారు. పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మిగిలిన వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మధ్యాహ్నం 12.36 గంటలకు చేరుకున్నారు. అక్కడ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని పిఠాపురం టీటీడీ కల్యాణమండంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు.అక్కడి నుంచి కొత్తపల్లి చేరుకుని పీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని చేబ్రోలు నివాసానికి చేరుకున్నారు. కారు నుంచే వినతిపత్రాలు స్వీకరించి సాయంత్రం 5.18 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లారు.



ఇంత దారుణమా..

గ్రామీణ నీటిపారుదల శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం తన పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తుండగా ఒక కుళాయి నుంచి నీరు మెల్లగా రావడం చూసి నిర్ఘాంత పోయారు.. కాసేపు అలా దీర్ఘంగా చూస్తుండిపోయారిలా..

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక సందడి

- ఉప ఎన్నికకు 11న నోటిఫికేషన్
- వచ్చేనెల 5న పోలింగ్ ● 9న లెక్కింపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

ఉభయగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ వర్గాలలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి గత ఏడాది డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యం అయింది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆయన పదవీ కాలం 2027 మార్చి 29వరకూ ఉంది. కానీ ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈఎన్నిక జరగనుంది. ఈ ఉప ఎన్నిక కోసం ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుంది. 18వతేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 19న నామినేషన్ల స్ర్కూటినీ చేస్తారు. 21న అభ్యర్థుల విత్‌డ్రాకు చివరి తేదీ. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుంది. 9న ఓట్లను లెక్కిస్తారు. 12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

అభ్యర్థులు ఎవరు?

ఇప్పటివరకు పీడీఎఫ్ ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థిగా పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మండలంలోని నార్నిమెరక్ పంచాయతీలోని గమల్లపేటకు చెందిన బొర్రా గోపీ మూర్తి పేరు ఖరారైంది. ఎస్‌టీయూ నుంచి లంకలపల్లి శ్రీనివాసరావు పేరు మొదట్లో వినిపించింది. కానీ ప్రస్తుతం మౌనంగా ఉండడం గమనార్హం. గత ఎన్నికలలో ఎస్‌టీయూ తరఫున పోటీ చేసి ఓడిపోయిన గంధం నారాయణరావు కూడా పోటీకి వస్తారనే ప్రచారం ఉంది.

ఓటర్లు వీరే

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు అంటే తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలలో ఉపాధ్యాయ వర్గాలకు., అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ జిల్లాల పరిధిలోని రంపచోడవరం, చింతూరు (ఎటపాక) డివిజన్ల పరిధిలోని టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఎలిమెంటరీ, యూపీ స్కూళ్ల టీచర్లకు ఓటు హక్కు లేదు. ప్రభుత్వ ప్రైవేట్ హైస్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీలలో పనిచేసే టీచర్లందరికీ ఓటు హక్కు ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల ఓటు హక్కుకు అర్హతను అక్కడి హెడ్మాస్టర్ , కళాశాలలో ప్రిన్సిపాల్స్ సిఫార్సు చేస్తారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో టీచర్ల అర్హతను జిల్లా విద్యాశాఖాధికారి సిఫార్సు చేస్తారు. ఇంజనీరింగ్ కళాశాలలోని టీచర్లకు జేఎన్టీయూకే సిఫార్స్ చేస్తుంది. 6న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. 2021లో జరిగిన ఎన్నికలలో సుమారు 17 వేల మంది ఓటర్లు ఉన్నారు. గతనెల 24న ప్రకటించిన ముసాయిదా జాబితాలో కొత్తగా 13,677 మందికి ఓటు లభించింది



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

గ్రీవెన్స్‌కు 180 అర్జీలు

అమలాపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మీ కోసం కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. అర్జీదారుల సమస్యల పట్ల అధికారులు తక్షణమే స్పందించి నిర్దేశిత గడువులోగా పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి అధికారులతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ టి.నిషాంతి, స్త్రీశిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఎం.ఝాన్సీరాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదన్‌మోహనరావులు 180 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించి వారి సంతకం తీసుకుని అర్జీదారుని ఫొటోలతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పదేపదే ఒకే అంశంపై ఫిర్యాదులు నమోదు కాకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసు బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ తీరు పట్ల అసంతృప్తి

- నియోజకవర్గంలో రాజ్యాంగేతర శక్తుల ఏలుబడి
- పట్టభద్రుల ఓట్ల నమోదులో నిర్లక్ష్యంపై సీఎం ఆగ్రహం
- టెలీ కాన్ఫరెన్సులో సుభాష్‌పై విరుచుకుపడ్డ చంద్రబాబు
- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరిక

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి, రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్ పనితీరు పట్ల పార్టీ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అధికార కూటమి శాసనసభ్యులు సైతం మంత్రి సుభాష్‌తో పెద్దగా సఖ్యత ప్రదర్శించకపోవడంతో ఆయన ఏకాకిగానే నియోజకవర్గాల్లో పర్యటనలు చేస్తున్నారు. మంత్రి సుభాష్ సొంత నియోజకవర్గమైన రామచంద్రపురం కంటే పక్కనే ఉన్న అమలాపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలోనే రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు జిల్లాస్థాయిలో జరిగే సమీక్షా సమావేశాలు గానీ, ఇతర కీలక సమావేశాలకు సుభాష్ గైర్హాజరవుతున్నారనే విమర్శలు ఇటీవల కాలంలో వ్యక్తమవుతున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో రాజ్యాంగేతర శక్తుల ఏలుబడిలోనే కార్యకలాపాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలల ముందు వరకు వైసీపీలో ఉన్న సుభాష్ సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. వెంటనే రామచంద్రపురం అసెంబ్లీ టిక్కెట్ కోసం చేసిన ప్రయత్నాలు సామాజిక కోణంలో ఫలవంతమయ్యాయి. దాంతో ఆ నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఐదు నెలలు దాటుతున్న తరుణంలో మంత్రి సుభాష్ పనితీరు పట్ల ఇటు జిల్లా ఎమ్మెల్యేలతో పాటు అటు సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితులు ఆయన పనితీరుకు అద్దం పడుతున్నాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు జాయిన్ చేసే విషయంలో నియోజకవర్గంలో సుభాష్ పనితీరుపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేయడంతో పాటు పార్టీ కోసం పనిచేయని మీకు రాజకీయాలెందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫస్ట్‌టైమ్ ఎమ్మెల్యే అయ్యావ్. పార్టీ గౌరవించి ఫస్ట్‌టైమ్ ఎమ్మెల్యే అయినా మంత్రిని చేశాం. అయినా పనితీరు మార్చుకోకపోతే సహించబోనంటూ సీఎం చంద్రబాబు సుభాష్‌ను నేరుగానే హెచ్చరించారు. మీ పద్ధతి మారకపోతే నా నిర్ణయం నేను తీసుకుంటానంటూ అసహనం కూడా వ్యక్తం చేశారు. దీనికితోడు ఇటీవల జరుగుతున్న కార్యక్రమాల్లో జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు మంత్రి సుభాష్ పేరును కనీసం బ్యానర్‌లో కూడా పెట్టని తీరు చూస్తుంటే ఆయనతో వారికున్న సఖ్యత ఏ పాటిదో అర్థమవుతోంది. సభ్యత్వాల నమోదే కాదు నియోజకవర్గంలో టీడీపీ, కూటమి శ్రేణుల పట్ల మంత్రి సుభాష్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ అక్కడక్కడా ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. రామచంద్రపురం కేంద్రంగా మంత్రి బంధు వర్గీయులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి తనిఖీలు చేయడం అధికారులకు హెచ్చరికలు జారీ చేయడం వంటివి ఇటీవల జరిగాయి. నియోజకవర్గంలో పార్టీ పట్టు కోల్పోతుందనే ఆ పార్టీ నాయకత్వం ఆవేదన చెందుతున్నప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు.





ఆవిరైన ఆనందం

ఫ్లెక్సీ పెడుతుండగా విద్యుదాఘాతం..

నలుగురి మృతి

తాడిపత్రిలో విషాదం

వార్త..7లో

ఇసుక, మట్టి మాఫియాకు అడ్డేలేదు

ఉడిమూడి నదీపాయలో డ్రెడ్జర్ ఏర్పాటు



పి.గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు కాలం కావడంతో నదీతీర ప్రాంతాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే వరదలు పోయి నదీతీర ప్రాంతాలు సామాన్య స్థితికి చేరుకోవడంతో గోదారమ్మ తీసుకువచ్చి పెట్టిన ప్రకృతి సంపదను దోచుకోవడానికి మాఫియా తనదైన శైలిలో రంగం సిద్ధం చేసుకుంటుంది. పెద్దలను ప్రసన్నం చేసుకుని మరీ నిబంధనలకు విరుద్ధమైన పనులకు పూనుకుంటున్నారు. ఈ క్రమంలోనే పి.గన్నవరం మండలం ఉడిమూడి నదీపాయలో మాఫియా ప్రతినిధులు ఆదివారం రాత్రి డ్రెడ్జర్‌ను ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. నదీపాయలో నిబంధనలకు విరుద్ధంగా అవతల ఒడ్డుకు ప్రవేశించడానికి అడ్డుకట్టతో మార్గం సుగమం చేసుకుంటున్నారు. అంతే కాకుండా ఏటిగట్టు దిగువున ఎక్స్‌కవేటర్ సాయంతో ర్యాంపును సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే పి.గన్నవరం నదీతీరం కూడా సీఆర్‌జెడ్ పరిధిలో ఉందని ర్యాంపులు వచ్చే అవకాశం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నట్లు లోపాయికార సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులను సైతం లెక్క చేయకుండా నదీపాయలో డ్రెడ్జర్ ఏర్పాటు చేయడంతో ఈ మాఫియా వెనుక పెద్ద నాయకుల హస్తం ఉందని పలువురు బాహాటంగా చెప్పుకుంటున్నారు. అవతలి ఒడ్డున ప్రవేశించి గతంలో మాదిరిగా కాసులకు కక్కుర్తిపడే రైతులు నుంచి కొనుగోలు చేసిన భూముల్లో మట్టి తవ్వకాలు జరిపేందుకు మాఫియా ప్రతినిధులు సన్నాహాలు చేసుకుంటున్నారని పలువురు చెబుతున్నారు. ఇసుక ర్యాంపులు విషయంలో ఉన్నతాధికారులు నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో స్థానికులకు ఇసుక ఇక్కట్లు తప్పడంలేదు. నదీతీరం సమీపంలో ఉన్నప్పటికి ఇసుక అందని ద్రాక్షలా మారింది. ఇసుక కొరతతో భవన నిర్మాణ కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సోషల్‌మీడియాలో డ్రెడ్జర్ సాయంతో తవ్వకాలు జరుగుతున్నాయన్న వార్త హల్‌చల్ చేయడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. తహశీల్దార్ పి.పల్లవి ఎస్ఐ బి.శివకృష్ణతో కలిసి నదీపాయ వద్ద జరుగుతున్న డ్రెడ్జర్ పనులను పరిశీలించారు. దీంతో నిర్వాహకులు తమ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

పరికరాల స్వాధీనం: తహశీల్దార్ పి.శ్రీపల్లవి

ఉడిమూడి నదీపాయలో డ్రెడ్జర్ సాయంతో కార్యకలాపాలు సాగిస్తున్నారని సమాచారం వచ్చింది. ఎస్ఐ బి.శివకృష్ణతో కలిసి నదీపాయను సందర్శించాం. పి.గన్నవరం మండలంలో ఎటువంటి తవ్వకాలకు అనుమతులు లేవు. అలాగే నదీపాయలో డ్రెడ్జర్‌ను వినియోగించకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తవ్వకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతానికి నదీపాయ వద్ద నిర్వాహకులు లేకపోవడంతో డ్రెడ్జర్‌తో సహా సంబంధిత యంత్ర పరికరాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించాం.

పాములకు.. మొక్కుదాం!



నేడు నాగుల చవితి



చవితి సందడి వచ్చేసింది.. ఇంటింటా ఆనందం తెచ్చేసింది.. కుటుంబంలో చిన్నా పెద్దా అంతా కలిసి చేసుకునే పండుగ నాగుల చవితి.. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకు నేందుకు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో ఉమ్మడి జిల్లాలో పాము పుట్టలు ఎక్కువగా ఉంటాయి.ఈ నేపథ్యంలో ప్రతి ఏడా ది ఆ పుట్టలు శుభ్రం చేస్తుంటారు. ఏడాదంతా పాము కనిపిస్తే చంపుదామని ప్రయత్నిస్తారు.. నాగుల చవితి రోజున మాత్రం పాము కనిపిస్తే పూజించడం మన సంప్రదాయం.

- సర్పపూజకు ప్రాధాన్యం
- పాము పుట్టలు ముస్తాబు
- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
- బిక్కవోలు ప్రసిద్ధి

అమలాపురం రూరల్/మండపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాములకు ఏడాదంతా ఒక లెక్క.. మంగళవారం ఒక లెక్క.. ఏడాదిలో ఏ రోజు పాము కనిపించినా భయపడతారు.. వెం టనే చంపేస్తారు.. అయితే మంగళవారం మాత్రం పాము కనిపించిందంటే మొక్కుతారు.. ప్రత్యేకంగా పూజలు చేస్తారు.. ఎందుకంటే నేడు కార్తీకశుద్ధ చతుర్థి.. దీనినే నాగుల చవితిగా నిర్వ హిస్తారు.. దీపావళి అనంతరం వచ్చే కార్తీకశుద్ధ చవితిని నాగుల చవితి చేస్తుంటారు. పాముల ఆరాధన ఈనాటిది కాదు.. ఎన్నో యుగాలనాటిది.సౌభాగ్యానికి, సత్సంతాన ప్రాప్తికి సర్పపూజ చేయడం లక్షల ఏళ్ల కిందటే ఉన్నట్టు ఎన్నో పురాణాలు చెబుతున్నాయి.ఈ మేరకు ఎన్నో ఆలయాల్లో నాగరాజు విగ్రహాలు కనిపిస్తాయి. ప్రధానంగా మహిళలు చవితిరోజు ఉపవాసం చేసి పుట్టల్లో గోక్షీరం పోస్తారు. నువ్వులు,బెల్లం కలిపిన చిమ్మిలి, గుడ్లు,తేగలు వంటివి వేస్తారు. పుట్టలు అందుబాటులో లేనివారు ఇంట్లోని పూజా మందిరంలో నాగదేవతను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. వెండితో గానీ, గంధపు చెక్కతోగానీ నాగేంద్రుడి ప్రతిమను తయారు చేసి అర్చన చేస్తారు. మహిళలు పుట్టమట్టిని నుదుటిన, కర్ణాలపైనా పూసుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలా పురం, కాకినాడల్లోనే కాక ఆయా మండలాల్లోని గ్రామాల్లోను పుట్టల వద్ద మంగళవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు నిష్ఠతో నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. చవితికి తూర్పుగోదావరి జిల్లా లోని బిక్కవోలు ప్రసిద్ధి.

ప్రకృతి ఆరాధన..

ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నాగుల చవితి పండుగ నిలుస్తుంది. నాగదోషం ఉన్నవారు నాగుల చవితి రోజున పుట్టలో తప్పక పాలు పోస్తారు. తమ దోషాలు తొలగించి సుఖసం తోషాలు ప్రసాదించమని నాగ దేవతలను వేడుకుంటారు. నాగుల చవితి రోజున పుట్టలో పాలు పోసి చలిమిడి, చిమిలి తమ గడపకు నివేదిస్తారు. పుట్టచుట్టూ పిండిని చల్లి ముగ్గులు వేయడం ద్వారా చీమలకు ఆహారం పెట్టడం ఏనాటి నుంచో ఉన్న ఆచారం. అందువల్ల ప్రకృతిలోని సకల జీవ జంతుజాలాన్ని సాటి ప్రాణులుగా ప్రేమించే ప్రగాఢ ఆత్మీయత.. ఆరాధించే నిరంతర అభ్యాసం అలవడ్డాయి. ఆ పరంపరలోనే విష సర్పాలను సైతం పూజిస్తూ భక్తి ప్రపత్తులను చాటుకునే ఆచారం అనాదిగా ఉంది. సర్పారాధనకు తామరపుష్పాలు, కర్పూరం, పూలు, లడ్డూ మొదలైనవి శుభప్రదమైనవి. సర్పారాధన చేసేవారి వంశం తామర తంపరగా వర్ధిల్లుతోందని భవిష్య పురాణం చెబుతోంది.

పుట్టను దర్శించుకుంటే..

ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ-సంతాన శ్రేయస్సుకు, విషమ సమస్యల నివారణకు, సుఖశాంతులకు, నేత్ర, కర్ణ, ఉదర సంబంధిత సమస్త వ్యాధుల నిర్మూలనకు నాగులచవితి శుభదినాన జరిపే నాగార్చన ఎంతో శ్రేష్ఠమైనదని శాస్త్రం చెబుతోంది. ప్రధానంగా మహిళలు చవితిరోజు ఉపవాసం చేసి పా ముల నివాస స్థలాలైన పుట్టల్లో గోక్షీరం పోస్తారు.నువ్వులు, బెల్లం కలిపిన చిమ్మి, పండ్లు మొదలైన వాటిని నివేదన చేస్తారు. మహిళలు పుట్టమట్టిని నుదుటిన, కర్ణాలపైనా ధరిస్తారు. ఉపవసించిన వారు మర్నా డు ఓ బ్రహ్మచారైన పురోహితుడికి భోజన తాంబూలాదులు సమర్పించి ఆ తర్వాతనే ఉపవాస దీక్షను విరమిస్తారు.ఇలా చేస్తే సర్పదోషాలు, సర్పజాతి వల్ల కలిగే భయాలు,గండాలు తొలగిపోతాయని భక్తుల అచంచల విశ్వాసం.

స్వామిని చూద్దామని..

చాగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం శివయ్యకు ఎంతో ఇష్టమైన రోజు.. అందునా తొలి సోమవారం చాగల్లు శివాలయంలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఆ పరమ శివుడి నిత్యాభిషేకం కోసం ఆలయ పూజారి చెరుకూరి శివ సీతారామ్ తెల్లవారుజామున ఆలయం తలుపులు తెరవగా శివలింగానికి చుట్టుకుని నల్లత్రాచుపాము దర్శనం ఇచ్చింది. నాగేంద్రుడు దర్శనంతో తన జన్మ ధన్యమైందని భక్తి పారవశ్యంతో స్వామికి మొక్కుకున్నాడు. పాము ఉన్నంత సేపు ఆలయ ముఖద్వారం వద్దనే వేచి ఉండి వేదమంత్రాలతో స్వామివారిని స్మరించుకున్నాడు. కొద్దిసేపటి తరువాత ఆలయం బయటకు వచ్చి పడగలతో ఉండే నాగేంద్రుడి విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ కొద్దిసేపు పడగవిప్పి దర్శనం ఇచ్చింది. పూజారి భక్తులకు తెలియజేయడంతో ఆపరమ శివుడే ఆలయానికి విచ్చేశారని ఆనంద పారవశ్యం చెందారు. విషయం తెలుసుకుని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని భక్తితో పూజలు చేశారు. చాగల్లు శివాలయ చరిత్రలో ఇదొక అద్భుతమని భక్తులు భావిస్తున్నారు.



చాగల్లు శివాలయంలో నల్లత్రాచుపాము



సామర్లకోట భీమేశ్వరాలయం కోనేరు వద్ద తెల్లవారుజామున సూర్యోదయం

భానుడు గీసిన.. చిత్రమిది!

ప్రకృతి అంటేనే అందం.. ఆ అందాన్ని మనసారా ఆస్వాదించాల్సిందే.. తనివితీరా వీక్షించాల్సిందే.. ఈ చిత్రమే చూడండి ఎంత అందంగా ఉందో కదూ.. చిత్రకారుడు కలం నుంచి జాలువారి నట్టు ఉంది కదా.. కానే కాదు.. ఇది ప్రకృతి గీసిన చిత్రం.. సోమవారం తెల్లవారుతుండగా భానుడు ఇలా దర్శనమిచ్చాడు.. కార్తీక మాసం సోమవారం సందర్భంగా సామర్లకోట భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడుతోంది.. భక్తులంతా స్నానమాచరిస్తుండగా భీమేశ్వరాలయం వద్ద కోనేరులో తన ప్రతిరూపం తానే సూరీడు ఇలా ఉదయించాడు.. ఈ సుందర దృశ్యం ఆంధ్రజ్యోతి కెమెరాకు ఇలా చిక్కింది.. - సామర్లకోట



సామర్లకోటలో భీమేశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



పిఠాపురం పాదగయ పుష్కరిణి వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రాజమహేంద్రవరం గోదావరిలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో స్వామి దర్శనానికి వేచిఉన్న భక్తులు

ఆలయాల్లో 'కార్తీకం' సందడి

- కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల పుణ్యస్నానాలు

కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు.

వైభవంగా కోటిబిల్వార్చన

- అయ్యప్ప శరణుఘోషతో మార్మోగిన ప్రాంగణం
- కోలాహలంగా అయ్యప్పస్వాముల పేడధూళి
- లక్ష దీపాలతో ప్రత్తిపాడులో ఆధ్యాత్మిక సందడి





లక్ష దీపోత్సవాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు. పక్క చిత్రంలో పడిపూజకు హాజరైన భక్తులు

ప్రత్తిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మొదటి కార్తీక సోమవారం ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. ప్రత్తిపాడు మినర్వా కళాశాల సమీపంలో లక్షదీపాల మధ్య కోటి బిల్వార్చన పూజలు వైభవంగా జరిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు అనకాపల్లి, విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీ ఎత్తున అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. కేరళ సంప్రదాయ మంగళ వాయిద్యాల మధ్య పేడధూళి కార్యక్రమాన్ని కోలాహలంగా జరిపారు. అయ్యప్ప కోటిబిల్వార్చన ప్రాంగణం వద్ద ఉదయం గణపతి పూజ, మండపారాధన, లక్ష్మీ గణపతి హోమాలు, చండీహోమం, పూర్ణాహుతి యాగాలు చేశారు. దంపాళిగురువర్యుల గురుపూజోత్సవం చేశారు. అష్టాదశ కలశాలతో మహిళా భక్తులు స్వామి ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం పందల రాజవంశీకులు నారాయణవర్మ ప్రాంగణానికి చేరుకోగానే వేదపండితులు, అయ్యప్ప భక్తులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆయన లక్ష దీపోత్సవానికి దీపాన్ని వెలిగించి ప్రారంభించగా అయ్యప్ప భక్తుల శరణుఘోషతో కోటి బిల్వార్చన పూజలకు శ్రీకారం చుట్టారు. శబరిమలకు చెందిన ఆలయ పూజారి మేల్ శాంతి సంప్రదాయ పద్ధతిలో లక్ష బిల్వార్చన పూజ చేశారు. పడిపూజా కార్యక్రమానికి ప్రాంగణమంతా అయ్యప్ప భక్తులతో నిండిపోయింది. లక్ష దీపోత్సవంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా దీపాలను వెలిగించారు. కేరళలోని శబరిమల అయ్యప్ప సన్నిధానం మాదిరిగానే ఇక్కడ పూజలు చేశారు. అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

పులగుర్తలో ఆర్టీసీ బస్సు బోల్తా

• ముగ్గురికి గాయాలు • ఆసుపత్రికి తరలింపు • చెట్టు అడ్డు ఉండడంతో తప్పిన ముప్పు



అనపర్తి మండలం పులగుర్త వద్ద బోల్తాపడ్డ ఆర్టీసీ బస్సు

అనపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు బోల్తాపడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో రావులపాలెం బయలు దేరింది. అనపర్తి మండలం పులగుర్త వచ్చేసరికి అదుపుతప్పి రామచంద్రపురం- మండపేట కెనాల్ వైపు బోల్తాపడింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురై ఆర్తనాదాలు చేశారు. రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఉండటంతో బస్సు కాలువలోకి వెళ్లలేదు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్ సహా 26 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు స్పందించి 108కి సమాచారం అందించి ప్రయాణికులను బయ టకు తీసుకు వచ్చారు. వీరిలో రాయవరం గ్రామానికి చెందిన బొడ్డు సూర్యకళ, తూరంగికి చెందిన కొప్పిశెట్టి ఆంజనేయరాజు, కె.మల్లవరం గ్రామా నికి చెందిన నూకల వీరభద్రరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూర్యకళ తలకు బలమైన గాయం కావడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు. బస్సు స్టీరింగ్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని డ్రైవర్ తెలిపారు.

కార్తీకమాసంలో పరమేశ్వరుని పూజ ఎంతో శ్రేష్టం

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పరమేశ్వరుని పూజించడం ఎంతో పుణ్యమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి కె.గంగవరంలోని శివాలయం ఆవరణలో ఆయన భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్తీక మాసం విశిష్టత, పరమేశ్వరుడిని పూజించే విధానం, కార్తీకమాసంలో శివుడిని పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. తొలుత అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు చాగంటి ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆలకించారు.



గంగవరంలో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మరో ప్రపంచ రికార్డుకు శ్రీ చైతన్య విద్యార్థులు సన్నద్ధం

రాజమహేంద్రవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు మరో ప్రపంచ రికార్డుకు సన్నద్ధమవుతున్నారని యాజమాన్యం తెలిపింది. పదివేల మంది విద్యార్థులు 600 మ్యాథ్స్ ఫార్ములాలను ఏక కాలంలో పఠించడానికి ఏర్పాట్లు చేశారు. దీన్ని యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారంలో తిలకించడమే కాకుండా పర్యవేక్షించనున్నారు. తుది తీర్పు నవంబరు 6న వచ్చే అవకాశం ఉందని శ్రీచైతన్య యాజమాన్యం పేర్కొంది.

మాటలు కాదు..

చేతల్లో చేసి చూపిస్తున్నా!

- పిఠాపురం సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- పిఠాపురం సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తాం
- రూ.39.76కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు
- ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్
- సమస్యలు నా దృష్టికి తెస్తే తక్షణం పరిష్కరిస్తా
- గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ల్యాబ్‌లో విద్యార్థులతో పవన్‌కల్యాణ్ సెల్ఫీ

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని జడ్పీ బాలురఉన్నత పాఠశాల వేదికగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పలు అభివృద్ధి పనులకు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రజలు, మీడియాతో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ ప్రజలు బలంగా నిలబడి రాష్ట్రంలో, దేశంలో బలంగా నిలిపారని, మీ ఆశీస్సులతో డిప్యూటీ సీఎం అయ్యాయనని అన్నారు. మీ రుణం తీర్చుకునే విధంగా పనిచేసి చూపిస్తానని తెలిపారు.

పనులు చేసుకుంటూ వెళ్తా

ప్రతిరోజూ నేను స్వయంగా ఇక్కడకు రాలేకున్నా, నా మనస్సు అంతా ఇక్కడే ఉంటుందని డిప్యూటీ సీఎం పవన్ చెప్పారు. తాను నోటితో చెప్పనని పనులు చేసుకుంటూ వెళ్తున్నానని తెలిపారు. నా కళ్లు, చెవులు మీరే, ఏ సమస్యను అయినా నా దృష్టికి తీసుకురండి, దాన్ని పరిష్కరించేలా కృషి చేస్తానని ప్రకటించారు. తాను తరచూ ఇక్కడకు రాలేకున్నా, ఇక్కడ ఉన్న సమస్యలు, ప్రజలు ఇబ్బందులను ప్రత్యేకంగా అధికారులను పంపి తెలుసుకుంటున్నానని తెలిపారు. సుద్దగడ్డ వరదలు వచ్చినప్పుడు గొల్లప్రోలు జగనన్న కాలనీకి వచ్చి వారి కష్టాలు స్వయంగా చూశానని, రాకపోకలకు వారు పడుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తానని హామీ ఇచ్చానని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లా ఖనిజ నిధుల నుంచి బ్రిడ్జి నిర్మాణానికి కలెక్టరు ద్వారా రూ.4కోట్లు మంజూరు చేయించిఈ రోజున శంకుస్థాపన చేశానని, అది తన నిబద్ధత అనితెలిపారు. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

పిఠాపురం ప్రాంత అభివృద్ధి సంస్థ ఏర్పాటు

పిఠాపురం నియోజకవర్గ పరిధిగా పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ఇది త్వరలోనే కార్యరూపం దాలుస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిగా ఉన్న పిఠాపురంసీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకుగాను అదనపు భవనాల నిర్మాణం, స్కానింగ్ సహా అన్ని అత్యాధునిక సదుపాయాల కల్పనకు రూ.39.76కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో రూ.14.38కోట్ల వ్యయంతో 223 సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని పవన్ చెప్పారు. మరో రూ.5.54కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలకు త్వరలోనే ఆమోదం లభిస్తుందని తెలిపారు. గొల్లప్రోలు, నాగులాపల్లి సీపీడబ్ల్యూఎస్ పథకాల మరమ్మతులకు రూ.56లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. పిఠాపురం పశువుల సంత ఆధునికీకరణకు ఇచ్చిన మాట ప్రకారం రూ.1.34కోట్లను మంజూరు చేశామని, ఇప్పటికే టెండర్లు పిలిచారని తెలిపారు. విశాఖ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆగేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వన్నెపూడి ఎస్సీ కాలనీ శ్మశానవాటిక అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 22 సెంట్లు భూసేకరణ చేయడంతోపాటు రూ.28లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాస పెంపొందించేందుకు 33 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేబ్రోలులో కోటి రూపాయిలతో నగరవనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పిఠాపురంలో సీపేజీ వాటర్‌ప్లాంటు ఏర్పాటుకు ఆరు ప్రాంతాల్లో 2.40 ఎకరాలను సేకరించనున్నట్లు తెలిపారు. గొల్లప్రోలు డంపింగ్‌యార్డు ఏర్పాటు నిమిత్తం భూసేకరణ చేయనున్నామన్నారు.

పట్టురైతులకు తక్షణ పరిష్కారం

కర్నాటక రాష్ట్రం నుంచి పట్టు గుడ్లు తెచ్చి గూళ్లు కట్టకపోవడంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారంగా రూ.11లక్షలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అక్కడికక్కడే మంజూరు చేయించారు. కలెక్టరు అందించిన పరిహారం చెక్కును రైతులకు చూపించారు. పట్టుగూళ్లు కట్టకపోవడానికిగల కారణాలను గుర్తించేందుకు హిందూపురం నుంచి సెరీకల్చర్ రీసెర్చ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలను రప్పించామన్నారు. పట్టురైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు.

సెజ్ రైతుల ఇబ్బందులు పరిష్కరిస్తాం

కాకినాడ సెజ్ రైతుల ఇబ్బందులను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం పవన్ తెలిపారు. సెజ్ రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. భూములు ఇచ్చి రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భూమలు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరు షాన్‌మోహన్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు.



పట్టు రైతులకు చెక్కు అందజేస్తున్న పవన్



పవన్‌కు వినతిపత్రాలు ఇస్తున్న సెజ్ రైతులు, ఇతరులు



పిఠాపురం పట్టణం రథాలపేటలో సమస్యలు తెలుసుకుంటున్న పవన్‌కల్యాణ్

వలకట్ల స్థలం దక్కించుకునేందుకు...


పోటీలో పాల్గొన్న మత్స్యకారులు

గోదావరిలో వలకట్ల అత్తరాల (స్థలం) దక్కించుకోవడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో మత్స్యకారులు సోమవారం పడవల పోటీలు నిర్వహించారు. గోదావరికి వరదలు వచ్చినప్పటి నుంచి తగ్గే వరకు చేపల వేట నిలిపివేయడం మత్స్యకారుల కట్టుబాటు. వరద తగ్గిన అనంతరం బలుసుతిప్ప నుంచి కోటిపల్లి గోదావరిలో వలకట్ల (అత్తరాల) వేటాడే స్థలం కోసం 100 ఇంజన్ బోట్లతో పోటీలు నిర్వహిస్తారు. ఎవరైతే పోటీల్లో గోదావరిలో స్థలం దక్కించుకుంటారో మళ్లీ వరదలు వచ్చేవరకు చేపల వేటకు ఆ స్థలం వారి అధీనంలో ఉంటుంది. ఏటా మాదిరిగా దీపావళి అనంతరం పోటీలు జరిపారు. - కాట్రేనికోన

ప్రత్తిపాడులో మహిళా అఘోరా సందడి



కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సోమవారం ఒక మహిళా అఘోరా సందడి చేసింది. విజయవాడ నుంచి విశాఖపట్నం కారులో వెళుతూ పెట్రోలు కోసం బంకు వద్ద ఆగింది. దీంతో అక్కడే ఉన్న శివ, భవాని భక్తులు మహిళా అఘోరాను బయటకు రావాలని కోరగా ఆమె కారు దిగి కలియ తిరిగింది. భక్తులు నమస్కరించగా తిరిగి ఆమె కారు ఎక్కి వెళ్లిపోయారు. కాగా ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)



పురుషులు, మహిళల విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన సురేష్, నాగలక్ష్మీదుర్గలను అభినందిస్తున్న ఇన్‌చార్జి ఉప కులపతి శ్రీనివాసరావు

నన్నయ యూనివర్శిటీకి మంచిపేరు తేవాలి

ఉప కులపతి శ్రీనివాసరావు

అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక పోటీలు

దివాన్‌చెరువు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు మరింత క్రీడా స్ఫూర్తితో అఖిల భారత పోటీల్లో పాల్గొని విశ్వవిద్యాలయానికి మంచిపేరు తేవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు కోరారు. నన్నయ వర్శిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ మహిళల, పురుషుల చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించారు. రాజానగరం నుంచి కానవరం వెళ్లి వచ్చే విధంగా 10 కి.మీ. మేర నిర్వహించిన ఈ పోటీలను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి, వీసీ మాట్లాడుతూ వివిధ గ్రామాల మధ్య నుంచి నిర్వహించే పరుగు పందెం పోటీలే క్రాస్ కంట్రీ పోటీలన్నారు.

పురుషుల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థి బి.సురేష్ 10 కి.మీ. పరుగును 36.50 నిమిషాల్లో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు. భీమవరం డీఎన్‌ఆర్ కళాశాల విద్యార్థి ఎం.లీలాగణేష్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం, భీమడోలు ఎస్‌వీ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.సాయిరామ్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

మహిళల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థి బి.నాగలక్ష్మీదుర్గ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వై.కౌశల్య ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం, కాకినాడ ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల విద్యార్థి ఎస్.శిరీష తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. పురుషులు, మహిళలు కేటగిరీల్లో నాలుగు, ఐదు, ఆరు స్థానాలు సాధించిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన ఆరుగురు పురుషులు, మరో ఆరుగురు మహిళా విద్యార్థులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేశారు. మంగుళూరు విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి జరిగే అఖిల భారత క్రాస్ కంట్రీ పోటీల్లో వీరు పాల్గొంటారు. చెప్పారు. పురుషుల, మహిళల ఓవరాల్ చాంపియన్‌షిప్ విన్నర్స్‌గా నిలిచిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కార్యనిర్వాహక కార్యదర్శులు ఎ.సత్యనారాయణ, కె.బాలసత్యనారాయణ, పరిశీలకురాలు జి.ప్రమీలారాణి, ఎంపిక కమిటీ సభ్యులు బీవీ నరసింహరాజు, పి.సునీతమ్మ, రాజానగరం ఎస్ఐ నాగార్జున, విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ జట్టు ఎంపిక

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ జట్టు ఎంపిక పూర్తయినట్టు పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి కె.బాలసత్యనారాయణ తెలిపారు. పురుషుల జట్టులో బి.సుభేష్ (ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల, తణుకు), ఎం.లీలాగణేష్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), పి.సాయిరాం (ఎస్‌వీ డిగ్రీ కళాశాల, భీమడోలు) ఎ.మోహనకృష్ణప్రసాద్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), ఎ.శివాజీ (ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), బి.మోహనరావు (ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), మహిళా జట్టులో బి.నాగలక్ష్మీదుర్గ (ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు), వై.కౌసల్య (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.శిరీష (ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల, కాకినాడ), బి.శిరీష (సీఆర్ రెడ్డి మహిళా కళాశాల), ఎస్.రిషిత (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.స్వాతి (సీఆర్ రెడ్డి కళాశాల, ఏలూరు) ఎంపికయ్యారు.

తండ్రిని హతమార్చిన తనయుడు

సోదరుడు, మేనత్తలపై దాడికి యత్నం

అడ్డుకున్న తండ్రిని కర్రతో కొట్టి చంపిన కొడుకు


మృతుడు తాతారావు (పాత చిత్రం)

తొండంగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కనిపెంచిన తండ్రిని కర్కశంగా కర్రతో కొడుకు కొట్టి చంపిన సంఘటన కాకినాడ జిల్లా తొండంగి మండలం గొల్ల మునలయ్యపేటలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్ల మునలయ్యపేటకు చెందిన యాదాల తాతారావుకు(66) ముగ్గురు సంతానం. వారిలో ఒకరు కుమార్తె కాగా... అర్జున్ ప్రథమ కుమారుడు, గోవిందు రెండో కుమారుడు. తాతారావుకు గల 9 ఎకరాల భూమిని పంచి ఇవ్వమని అనేక సార్లు అర్జున్ గొడవ పెట్టిన నేపథ్యంలో మూడు ఎకరాల చొప్పున భూమిని పంచి ఇచ్చాడు. తమ్ముడు వాటాలో ఒక ఎకరం రొయ్యల చెరువు రాగా తన జీవనాధారం కోసం తాతారావు తన దగ్గర ఉంచుకున్నాడు. అర్జున్‌కు సాధారణ భూమి వచ్చింది. తండ్రి వద్ద రొయ్యల చెరువు ఉంచుకోవడం అర్జున్‌కు నచ్చలేదు. దీంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. దాని కోసం తరచూ తండ్రితో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున గోవిందు, మేనత్త దండమ్మ ఇంటి వద్ద ఉండగా తలుపు తోసుకుని లోపలకు వెళ్లి గోవిందుపై దాడి చేసేందుకు అర్జున్ ప్రయత్నించాడు. దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన దండమ్మను కూడా తీవ్రంగా గాయపర్చడంతో ఆమె రోదనలు విన్న తాతారావు అక్కడకు రాగా అతడిపై కర్రతో దాడి చేయడంతో కుడి చెవి వద్ద, మెడపైన బలమైన గాయాలై తాతారావు అక్కడికక్కడే మృతి చెందాడు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ జగన్మోహన్ సంఘటనా స్థలిని పరిశీలించారు. మృతుడి చిన్న కుమారుడు గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాతారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అడవి పందుల వేటకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి


రెవెన్యూ భూమిలో విగతజీవిగా తలుపులయ్య

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం భావారం-నరేంద్రపట్నం గ్రామాల మధ్య ఉన్న రెవెన్యూ భూముల్లో చాలా మంది విద్యుత్ వైర్లతో వన్యప్రాణులను వేటాడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి అడవి పందులను వేటాడడానికి విద్యుత్ వైర్లు అమర్చడానికి పోతురాజు తలుపులయ్య అనే వ్యక్తి వెళ్లాడు. ఈ క్రమంలో అతడే విద్యుత్ షాక్‌కు గురై మరణించినట్టు స్థానికులు చెప్పారు. అటవీ, విద్యుత్, పోలీసు శాఖల అధికారులు సంఘటనాస్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు జగ్గంపేట ఎస్ఐ రఘునందన్‌రావు చెప్పారు.

పోలవరం కాల్వలో దూకి వ్యక్తి ఆత్మహత్య

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పద్మనాభ నగర్ చెందిన చిక్కాల చక్రధర్ (27) బైక్ షోరూమ్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గోకవరం రోడ్డులోని పోలవరం కాల్వ వద్దకు వెళ్లి కొందరు మిత్రులకు ఫోనులో మెసేజ్‌లు పెట్టాడు. అనంతరం కాల్వలో దూకినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఆదివారం రాత్రి నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పోలవరం కాల్వలో చక్రధర్ విగతజీవిగా కనిపించగా బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి పంపించారు. ఆత్మహత్యకు గల కారణాలను సీఐ వైఆర్కే శ్రీనివాసరావు తెలుసుకుంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యుపాశం



వీర్రాజు, నాగేంద్ర, మణికంఠ, కృష్ణ... రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు వీరివి.. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ముందుంటారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటులో కూడా అంతే ఉత్సాహం చూపారు. 18 నెలలుగా వివాదం నెలకొనడంతో ఎప్పుడెప్పుడు విగ్రహావిష్కరణ జరుగుతుందా అని ఎదురు చూశారు. వేర్వేరు కారణాలతో ఇరు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు జరగ్గా జిల్లా అధికారులు, నాయకులు శాంతి చర్చలు జరిపారు. ఒక కమిటీ వేసి కొన్ని నిబంధనలతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిచ్చారు. దీంతో ప్రారంభోత్సవ ఏర్పాట్లలో భాగంగా భారీ ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతంతో ఆ నలుగురు యువకులూ తనువు చాలించారు.



నలుగురు మృతికి కారణమైన ఫ్లెక్సీ

- సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు
- ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం
- నలుగురు యువకుల దుర్మరణం
- తాడిపర్రులో తీవ్ర విషాదం
- గ్రామంలో 144 సెక్షన్ ఏర్పాటు
- ఫ్లెక్సీల తొలగింపునకు తహసీల్దారు ఆదేశాలు
- కన్నీరుమున్నీరుగా విలపించిన బంధువులు
- మృతుల కుటుంబాలకు మంత్రి దుర్గేశ్, కలెక్టర్ ప్రశాంతి పరామర్శ
- ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటన

ఉండ్రాజవరం/పెరవలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సోమవారం ఉదయం సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విగ్రహావిష్కరణను ఎంతో ఘనంగా నిర్వహించాలని తలంచారు. అనుకున్నదే తడవుగా 20 అడుగుల భారీ ఫ్లెక్సీ చేయించారు. దానిని ఎంతో ఉత్సాహంగా తీసుకొచ్చి తెల్లవారుజామున ఏర్పాటుకు ఉపక్రమించారు. ఐరన్ చట్రానికి ఫ్లెక్సీని అంటించి కర్రలతో నిలబెట్టే సమయంలో రోడ్డు పక్క నుంచి వెళ్లిన 6.3 కేవీ సింగిల్ ఫేజ్ వైరు తగిలింది. ఐరన్ చట్రానికి విద్యుత్ ప్రవహించగా ఫ్లెక్సీ పట్టుకున్న ఏడుగురు యువకుల్లో బొల్లా వీర్రాజు (26), పామర్తి నాగేంద్ర (25), మారిశెట్టి మణికంఠ (26), కాసగాని కృష్ణ (25) అక్కడికక్కడే మరణించారు. కోమటి అనంతరావు తీవ్ర గాయాలపాలయ్యాడు. వెలిగట్ల పవన్, కోమటి వీర వెంకట సత్యనారాయణలకు స్వల్ప గాయాలయ్యాయి. రోజువారీ కూలితో కుటుంబాలు నెట్టుకొస్తున్న పేదల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయి.

తాడిపర్రు గ్రామానికి చెందిన బొల్లా వీర్రాజుకు 14 నెలల కిందట పెళ్లయింది. రెండు నెలల పాప ఉంది. తల్లిదండ్రులు, భార్య ఉన్నారు. వ్యవసాయం, కొబ్బరి దింపు పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మళ్లీ వస్తానంటూ వెళ్లావు కదరా... త్వరగా రా అంటూ తండ్రి త్రిమూర్తులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

పామర్తి నాగేంద్రకు పట్టింపాలెం గ్రామానికి చెందిన దుర్గతో వివాహమైంది. వీరికి 8 నెలల పాప ఉంది. కొబ్బరి దింపు కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. భర్త మృతి వార్తను జీర్ణించుకోలేకపోతోంది. తనకు దిక్కు ఎవరూ అంటూ రోదిస్తోంది. తల్లిదండ్రులు శ్రీను, ఆదిలక్ష్మి, అన్నయ్య వెంకటకృష్ణ ఉన్నారు.

మణికంఠ పూల డెకరేషన్‌లకు వెళ్తుంటాడు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడికి భార్య భవాని, అమ్మాయి (5), అబ్బాయి (3) ఉన్నారు. నలుగురు తోబుట్టువులు ఉన్నారు. ఒక్కడే అబ్బాయి కావడంతో మణికంఠను అల్లారుముద్దుగా పెంచారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు పద్దయ్య, లక్ష్మి, సోదరీమణులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కాసగాని కృష్ణ పెయింటింగ్ షాపులో చిరుద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. తండ్రి రాము ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉన్నాడు. ఇటీవలే అనారోగ్యం రావడంతో వచ్చి ఆపరేషన్ చేయించుకుని నెల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో వారం, పది రోజుల్లో ఇండియా వచ్చేస్తాడని బంధువులు చెప్పారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో.... ఇక మేమెందుకు బతకాలంటూ తల్లి పద్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు కోడిగుడ్లు కట్టుబడి పనికి వెళుతుంటాడు. ఇతడికి ఇద్దరు మగ పిల్లలు. తీవ్ర గాయాలతో ఉన్న భర్తను చూసి భార్య, తల్లిదండ్రులు సత్యనారాయణ, వెంకటలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు.

తణుకు ఆసుపత్రిలో మృతదేహాలను మంత్రి కందుల దుర్గేశ్ పరిశీలించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికీ రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు, వెలిగట్ల పవన్, కోమటి వీర వెంకట సత్యనారాయణలను మంత్రి దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

తాడిపర్రులో ఘటనా ప్రాంతాన్ని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి సోమవారం పరిశీలించారు. సంఘటన పట్ల విచారం వ్యక్తం చేసి బాధిత కుటుంబీకులను ఓదార్చారు. గ్రామంలో మరో సామాజికవర్గంవారు తమపై తరచూ ఘర్షణకు దిగుతున్నారని గౌడ సామాజికవర్గ మహిళలు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ కారు ముందు నిలుచుని తమకు న్యాయం చేసి వెళ్లాలంటూ నినాదాలు చేశారు. ఆర్డీవో రాణిసుస్మిత, డీఎస్పీ దేవకుమార్ నచ్చజెప్పడంతో మహిళలు వెనుదిరిగారు.

మృతదేహాల రాకతో ఉద్రిక్తత..

తణుకు ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో మృతదేహాలు స్వగ్రామమైన తాడిపర్రుకు చేరుకున్నాయి. అప్పటికే సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్దకు అధిక సంఖ్యలో మహిళలు, పురుషులు చేరుకున్నారు. మృతదేహాలను విగ్రహం వద్దనే ఉంచాలని.. వివాదానికి ఆజ్యం పోసేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వేరే సామాజికవర్గం యువకులను ఇక్కడకు తీసుకురావాలని వారంతా పట్టుబట్టారు. మహిళలు, గౌడ సామాజివర్గం నాయకులతో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడారు. వివాదాలకు ఇది సమయం కాదని సర్దిచెప్పారు. దీంతో మృతదేహాలను వాహనాల నుంచి కిందకు దింపి పాపన్న గౌడ్ విగ్రహం ముందు పెట్టి పువ్వులు చల్లి ఆయా కుటుంబీకుల ఇళ్ల వద్దకు చేర్చారు. అనంతరం మృతదేహాలను తీపర్రు తీసుకెళ్లి గోదావరి తీరంలో దహన సంస్కారాలు చేశారు. ఏ కార్యక్రమం జరిగినా ముందుండే యువకుల మృతిని గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారు.

ఒక వర్గానికి చెందిన ఫ్లెక్సీలు చించివేత

గ్రామంలోకి మృతదేహాలు వచ్చి వెళ్లిన అనంతరం కోపోద్రిక్తులైన ఒక వర్గం యువకులు గ్రామంలో వేరొక వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. పోలీసులు వద్దని వారిస్తున్నా వినకుండా రోడ్డు పొడవునా ఇరువైపులా పది నుంచి పదిహేను ఫ్లెక్సీలను చింపివేసి రోడ్డుపై పడవేశారు. అంతేకాకుండా కొంతమంది మరో వర్గం ఇళ్లపైకి వెళ్లిపోతుండగా పోలీసులు వారించి వెనక్కు తీసుకువచ్చారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని సోమవారం ప్రారంభించడానికి ముందు రోజు అదే రోడ్డులో ఒక ఇంటి ముందు మరో సామాజికవర్గానికి చెందిన నాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. దానికి పోటీగా అదే సైజులో ఏడుగురు యువకులు సర్దార్‌పాపన్నగౌడ్ ఫ్లెక్సీని సోమవారం తెల్లవారుజామున ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. ఈ ఘటన అనంతరం తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్... గ్రామంలో ఎటువంటి ఫ్లెక్సీ ఉండరాదని, ఎవరు ఏర్పాటు చేస్తే వారే దానిని తీసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలా తొలగించని ఫ్లెక్సీలను పంచాయతీ తరపున తొలగిస్తామని ఆటో ద్వారా ప్రచారం చేయించారు. దీంతో కొన్ని ఫ్లెక్సీలను ఎవరికి వారు తొలగించగా.. మరికొన్ని ఫ్లెక్సీలను పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఇరు సామాజికవర్గాల మధ్య గొడవలు జరిగే సూచనలు కనిపించడంతో తాడిపర్రులో సెక్షన్ 144 విధించారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన వారితో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పరామర్శించారు. సంఘటనా స్థలానికి వెళ్లి మృతులకు సంతాపం తెలిపారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మాట్లాడుతూ.... నలుగురు యువకుల మృతి బాధాకరమని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. తమ సామాజికవర్గానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడం బాధాకరమని గౌడ సంఘ మాజీ అధ్యక్షుడు మోతుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోనే ఈ ఘోరం జరిగిందన్నారు.

ప్రమాదం విచారకరం

బాలగంగాధర్‌తిలక్, ట్రాన్స్‌కో ఎస్ఈ

తాడిపర్రులో విద్యుత్ ప్రమాదంలో నలుగురు మృతి చెందడం విచారకరం. ఫ్లెక్సీలు కట్టిన ప్రాంతంలో 6.3 కేవీ విద్యుత్ లైన్ ఉంది. 3 అడుగుల దూరంలో ఏది ఉన్నా కరెంట్ షాక్ కొడుతుంది. ఫ్లెక్సీలను నేల నుంచి 6 నుంచి 10 అడుగులు లోపే పెట్టుకోవాలి. ఎత్తు పెరిగితే ప్రమాదాలు జరుగుతాయి. మృతుల కుటుంబాలకు తమ శాఖ తరపున ప్రభుత్వానికి నివేదిక పంపుతాము.



వీర్రాజు, నాగేంద్ర (పైన)


మణికంఠ, కృష్ణ (కింద)

తాడిపర్రు ఘటనపై ఎంపీ పురందేశ్వరి దిగ్భ్రాంతి

ఆస్ట్రేలియా నుంచి ఫోన్ ద్వారా మృతుల కుటుంబాలకు సానుభూతి సందేశం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో నలుగురు యువకులు మృతి చెందిన ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆమె తాడిపర్రు దుర్ఘటన గురించి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి విషయాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారిని ఆదుకుంటామన్నారు.


తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు


స్థానికులతో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

తణుకు ఆస్పత్రికి మృతదేహాలు



తణుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన నలుగురు మృతదేహాలను తణుకులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆసుపత్రి ప్రాంగణం నిండిపోయింది. విషయం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆస్పత్రి వద్దకు వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. శవ పంచనామా నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన కోమటి అనంతరావుకు గాయాలు కావడంతో తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారిని

ఆధునికీకరించాలి

● వాడుకుంటూ రహదారిని పట్టించుకోని ఓఎన్జీసీ



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

ఉప్పలగుప్తం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం రవ్వ చమురు ప్రాజెక్టు నుంచి అమలాపురం ఎర్రవంతెన వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారిని పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలంటూ బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రధాన పంటకాల్వ పక్కన ఉన్న ఆర్అండ్‌బీ రహదారిపై సామర్థ్యానికి మించి ఓఎన్జీసీ భారీ వాహనాలను నడుపుతోందని, రహదారి నిర్మాణ బాధ్యతను గతంలోనే ఆ సంస్థ తీసుకుందని కలెక్టర్‌కు వివరించారు. అయితే తమ అవసరాలకు వాడుకుంటున్న రహదారిని అభివృద్ధి చేయడంలో మాత్రం ఓఎన్జీసీ నిర్లక్ష్యం చేయడం ఆనవాయితీగా మారిందన్నారు. గతంలో సైతం ఎన్నోసార్లు ఉద్యమాలు చేస్తేనే రహదారి గుంతలు పూడ్చిన చరిత్ర ఆ సంస్థకు ఉందన్నారు. ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఓఎన్జీసీ రహదారిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ రహదారి శిథిలావస్థకు చేరడంతో రెండేళ్లుగా ఎన్నో ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎస్ఆర్ నిధులను వేరే ప్రాంతాలకు తరలిస్తూ స్థానికంగా రహదారులను నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణం రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కుంచే బాబులు, పెట్టా అప్పారావు, నాని, జంగా ప్రసాద్, వస్కా మల్లేశ్వరరావు, పండు అంబేడ్కర్, వెంకటేశ్వరరావు, కె.అనీల్‌కుమార్ ఉన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1,11,111 విరాళం



దాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అర్చకులు



అంతర్వేది: విరాళమందిస్తున్న దాతలు

అయినవిల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో అన్నదాన ట్రస్టుకు రూ.1,11,111 విరాళం అందజేశారు. అయినవిల్లికి చెందిన లావణ్యసరోజిని, వారి కుటుంబ సభ్యులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు వారి తండ్రి నేమాని వెంకటసుబ్బారావు పేరున రూ.1,11,111 విరాళాన్ని అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతలను అభినందించి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేసి అభినందించారు.

అంతర్వేది, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం పశ్చిమగోదావరి జిల్లా కాళ్లకూరుకు చెందిన అడ్డాల వంశీరాజు-వెంకటస్వామి దంపతులు రూ.25,116 విరాళంగా అందించారు. అలాగే తునికి చెందిన వెలవెల సాయిసమీర్-భవ్యమంజూష దంపతులు రూ.25 వేలు నిత్యాన్నదాన ట్రస్టుకు అందించారు. ఈ విరాళాలను సూపరింటెండెంట్ పి.విజయసారథి చేతులమీదుగా అందుకున్నారు. విరాళాలు ఇచ్చిన దాతలకు అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

రాజోలు సీహెచ్‌సీ కమిటీ సభ్యులకు సత్కారం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన రాజోలు ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి కమిటీ సభ్యులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కోసం పాటుపడాలని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎన్నికైన టీడీపీ నుంచి మటపర్తి లక్ష్మి, బీజేపీ నుంచి పితాని శ్రీను, జనసేన నుంచి ఉలిశెట్టి అన్నపూర్ణలను ఎమ్మెల్యే దేవ సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, రాజోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, కడలి వెంకటరమణరావు, అడబాల విజయ్, మోకా పార్వతి, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, మామిడిశెట్టి నాగరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

రాజోలు నుంచి రాజమహేంద్రవరం నాన్‌స్టాప్ బస్ సర్వీసు నడపాలి

రాజోలు ఏపీఎస్ఆర్టీసీ డిపో నుంచి రాజమహేంద్రవరం, రాజోలు నుంచి అమలాపురం వరకు నాన్‌స్టాప్ బస్ సర్వీసులను ప్రయాణికుల కోరిక మేరకు నడపాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రాజోలు ఏపీఎస్ఆర్టీసీ డీఎం డి.భాస్కరరావుకు సూచించారు. రాజోలు ఏపీఎస్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ డిపో మేనేజర్ భాస్కరరావుతో బస్సు సర్వీసులు, పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాజోలు డిపోలో 54 బస్సులు, 9 హైయర్ బస్సులు ఉన్నాయని ఎమ్మెల్యే దేవకు డీఎం భాస్కరరావు వివరించారు. 6 సూపర్‌లగ్జరీ కొత్త బస్‌లు రావాలని తెలిపారు. పాలకొల్లు రైల్వేస్టేషన్‌లో రాజోలు డిపో నుంచి వెళ్లే బస్సులను వెళ్లనివ్వడం లేదని, దాని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దేవ దృష్టికి నాయకులు తీసుకువెళ్లారు. రైల్వేశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే దేవ తెలిపారు. రాజోలు డిపో నుంచి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే దేవ ఆర్టీసీ డీఎం భాస్కరరావుకు పలు సూచనలు చేశారు.

సూపర్-6 పథకాలను తక్షణం అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాలను తక్షణం అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పాఠశాల విద్యార్థులకు రూ.15 వేలు తక్షణం చెల్లించాలని, ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు చొప్పున చెల్లించాలని డిమాండు చేశారు. గౌరవాధ్యక్షుడు దేవ రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు శీలం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, శామ్యూల్, రాము, రవికుమార్ పాల్గొన్నారు.

● రాజోలు నియోజకవర్గ పరిధిలోని చింతలపల్లిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువులను తక్షణమే మూసివేయాలని డిమాండు చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనధికార రొయ్యల చెరువు వల్ల నీరు, గాలి కలుషితమై ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని సీపీఐ రాజోలు ఏరియా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. తక్షణం రొయ్యల చెరువును మూసివేయాలని నినాదాలు చేశారు. నాయకులు కొప్పుల సత్తిబాబు, సర్పంచ్ మట్ట సురేష్‌కుమార్, కటికదల శ్రీను, సరెళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వండి

మలికిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన వారందరికీ జనవరి నెల నుంచి పింఛన్లు ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కోరారు. జనవరి నెల నుంచి కొత్త పింఛన్లుఇచ్చే విధానాన్ని అమలు చేయాలని,కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు.



కుండలేశ్వరంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పి.గన్నవరం గరుడేశ్వరస్వామి



ముక్తీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి



మాచవరం పార్వతీ రాజేశ్వరస్వామి

కార్తీక శోభ

● శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు ● శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కాట్రేనికోన, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం జిల్లాలో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుండలేశ్వరంలో భక్తులు పోటెత్తారు. వృద్ధగౌతమిలో పుణ్యస్నానాలాచరించి శ్రీపార్వతీకుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాశ్మకూరి కామేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. చెయ్యేరు, పి.లక్ష్మివాడ, ఉప్పూడి, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, కందికుప్ప, పల్లంకుర్రు, మగసానితిప్ప శివాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు శివపూజలు నిర్వహించారు. అలాగే పత్సమట్ల సత్యవతి జ్ఞాపకార్థం కుమారుడు సూర్యనారాయణరాజు ఆర్థిక సహాయంతో అన్నసమారాధన జరిగింది. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, దాట్ల పవన్, పత్సమట్ల సూర్యనారాయణరాజు, సత్తిబాబు, నిరంజనరావు, భాను, రవి పాల్గొన్నారు.

ముక్తేశ్వరస్వామి ఆలయంలో..

అయినవిల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరంలోని శ్రీముక్తికాంత క్షణముక్తీశ్వరాలయం, శ్రీరాజరాజేశ్వరి సమేత ముక్తీశ్వరాలయం, అయినవిల్లి శ్రీవిశ్వేశ్వరాలయం, సిద్ధివినాయకాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పరమేశ్వరునికి పూజలు, దీపారాధనలు చేశారు. లఘున్యాసం, రుద్రాభిషేకం నిర్వహించారు.

గురుడేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

పి.గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కారుపల్లి, వై.కొత్తపల్లి, ఉడిమూడి, మానేపల్లి, మొండెపులంక, నరేంద్రపురం, కుందా లపల్లి, ముంగండలో శివాలయాలు కిటకిటలా డాయి.

ఘనంగా లక్ష బిళ్వార్చన

మామిడికుదురు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సోమవారం మండలంలోని పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాల్లోగల శివాలయాల్లో లక్ష బిల్వార్చనలు ఘనంగా నిర్వహించారు. పెదపట్నంలంక గ్రామంలోని శ్రీఉమాసత్యలింగేశ్వరస్వామి ఆలయంలో విఘ్నేశ్వరపూజ, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు

ముమ్మిడివరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని ఉమా సూరేశ్వరస్వామి ఆలయం, క్రాపచింతలపూడిలోని ఉమా వల్లభేశ్వర స్వామి ఆలయం, కొత్తలంకలోని భోగమల్లేశ్వర స్వామి ఆలయం, ఠాణేలంక, అయినాపురం, కొమానపల్లి, అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి తదితర గ్రామాల్లో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పళ్లవారిపాలెం, గేదెల్లంక ఉత్తరవాహిని ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరించారు.

ఏకాదశ రుద్రుల ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అంబాజీపేట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఆర్టీసీ బస్సు డిపోనుంచి ప్రత్యేక బస్సు ద్వారా భక్తులను ఈ ప్రాంతానికి తీసుకువచ్చి ఏకాదశ రుద్రుల దర్శనం అవకాశం కల్పించారు. నందంపూడి, మాచవరం గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం పార్వతీరాజేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన పూజలను నిర్వహించారు.

ఉప్పలగుప్తం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధానంగా గొల్లవిల్లి, సన్నవిల్లి, విలసవిల్లి, ఉప్పలగుప్తం, మునిపల్లి, చల్లపల్లి, ఎస్.యానాం, భీమనపల్లి, ఎన్.కొత్తపల్లి శివాలయాల్లో ప్రత్యేక పూజల కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అల్లవరం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, బోడసకుర్రు, గోడి, అల్లవరం, దేవగుప్తం, గోడిలంక, కొమరగిరిపట్నం, తాడికోన శివాలయాల్లో కార్తీక మాస పూజలు ఘనంగా జరిగాయి. రామేశ్వరం శివాలయం వద్ద పొలిశెట్టి జాజినర్సిబాబు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ అంగాని రామారావు తెలిపారు. రామేశ్వరం వద్ద భక్తులు సముద్ర స్నానాలు చేశారు.

అంతర్వేది, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో, గుడిమూల కృతకత్యరామ లింగేశ్వరస్వామి ఆలయం, మోరి శివాలయంలో భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరుని వద్ద దీపారాధనలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకసోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

యానాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీగోదావరి పుష్కరఘాట్‌కు తరలివచ్చారు. కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. దీంతో రాజీవ్‌గాంధీ బీచ్ శివంబాత్ వద్ద భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు.

ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలకు ఏర్పాట్లు

అమలాపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలు డిసెంబరు 5 నుంచి నిర్వహిస్తున్నట్టు రిలయన్స్ సీఎస్సార్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 5న రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలోను, 6న అంబేడ్కర్ భవన్‌లోను, 7న కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి క్విజ్ పోటీలు జరుగుతాయి. విషయ పరిజ్ఞానం, ప్రపంచ భారతదేశ చరిత్ర, సామాజిక అంశాలు క్విజ్ పోటీలో ప్రధాన అంశాలుగా ఉంటాయన్నారు. ఒక్కొక్క టీమ్‌లో ఇద్దరు విద్యార్థులు చొప్పున ఒక్కో స్కూలు నుంచి రెండు టీములను అనుమతిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వేర్వేగా ఈ పోటీలు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బస్ ప్రయాణ చార్జీలు చెల్లిస్తామన్నారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఫోన్ 0884-3577222, సెల్ 6302223156ను సంప్రదించవచ్చునన్నారు.

పొన్నమండలో జగ్గారావు అనుమానాస్పద మృతి



మృతిచెందిన మెడబల జగ్గారావు

రాజోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండకు చెందిన మెడబల జగ్గారావు (93) ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. పొన్నమండలో మూడు పెంకుటిళ్ల సమీపంలో జగ్గారావు భార్య ధ్రువపతితో నివాసం ఉంటున్నారు. జగ్గారావుకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. జగ్గారావు, ధ్రువపతి మాత్రమే ఇంట్లో నివాసం ఉంటున్నారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు జగ్గారావు భార్య మెలుకువ వచ్చి చూసేసరికి ఇంట్లో జగ్గారావు లేకపోవడంతో బయటకి వెళ్లి చూడగా బాత్‌రూమ్ వద్ద రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ధ్రువపతి ఒక్కసారిగా గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. వెంటనే స్థానికులు రాజోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, రాజోలు ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసప్రసాద్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భార్య ధ్రువపతి ఫిర్యాదు మేరకు రాజోలు సీఐ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ రంగంలోకి దింపారు.

బస్ డ్రైవర్‌పై దాడికి నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల నిరసన

అమలాపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ కె.శ్రీనివాసరాజుపై భీమవరం సమీపంలోని కాళ్ల వద్ద జరిగిన భౌతిక దాడిని ఖండిస్తూ స్థానిక డిపోలో కార్మికులు జేఏసీ గేట్ మీటింగ్ నిర్వహించి సోమవారం నిరసన తెలిపారు. ప్రజా సేవ చేస్తున్న ఆర్టీసీ కార్మికులపై భౌతికదాడులు పెరిగిపోయాయని వెంటనే ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి కఠిన చట్టాలు తీసుకురావాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నినాదాలతో హోరెత్తించారు. ఎన్ఎంయూ అధ్యక్షుడు ఎండీ ఔలియా, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కె.రవికుమార్, రంగప్రసాద్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధి కె.రాంబాబు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులు ఎన్.మోహనరావు తదితరులు మాట్లాడారు. డ్రైవర్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడులకు పాల్పడితే కఠిన చట్టాల గురించి ప్రధాన కూడళ్లలో నోటీసు బోర్డులు ఏర్పాటుచేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

అఖండ అన్నసమారాధన

అమలాపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో తొలి సోమవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అమలాపురం పట్టణానికి చెందిన ఆకుల వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులచే కార్తీకమాసం నాలుగు సోమవారాలు అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు. చందన గౌరీశంకరనారాయణ భాగవత ప్రవచనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త పిచ్చిక వెంకన్న, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంటి, గోళ్ల మల్లేశ్వరరావు, ఉమా, అత్తిలింగం పాల్గొన్నారు.

దేవాంగులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

మామిడికుదురు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవాంగ సామాజికవర్గం వారికి నామినేటెడ్ పదవుల్లో చోటుకల్పించాలని దేవాంగ సాధికార కమిటీ పార్లమెంటు కన్వీనర్ కొండా జగదీశ్వరరావు కోరారు. కూటమి ప్రభుత్వంలో దేవాంగులకు నామినేటెడ్ పదవుల్లో అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 16లక్షల మంది దేవాంగులు ఉన్నారని, ఒక వర్గాన్నే ప్రోత్సహించకుండా అన్నివర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

'15వేల ఓట్లు నమోదు చేయాలి'

ముమ్మిడివరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 7వ వార్డు సచివాలయ పరిధిలో తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లి అశోక్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతీఒక్కరు ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు అత్యధిక ఓట్లు నమోదు చేయించాలని, ముమ్మిడివరం నియోజకవర్గంలో 15వేల ఓట్లు చేయించాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదేశించినట్టు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో దొమ్మేటి రమణకుమార్, పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, కాశి లాజర్, బూరుగు కల్యాణ్, నీతిపూడి వంశీ, పెయ్యల రత్నరాజు, బడుగు సాయి, యలమంచిలి రాజాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ఎన్డీయే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. కూటమి అభ్యర్థిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజశేఖర్‌ను ప్రకటించిన విషయం విదితమేనని, ఆయన విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, అత్యంత మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు 6 వరకు గడువు

అంబాజీపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటుహక్కు కోసం ఈ నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు జె.వెంకటేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. 2021 నవంబరు1 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు అప్లికేషన్, పదో తరగతి, డిగ్రీ, ఆధార్, ఓటరు కార్డు, ఫోటోను జిరాక్స్ కాపీలపై గెజిటెట్ సంతకాలతో ఎంపీడీవో, విద్యాశాఖ, తహసీల్దారు కార్యాలయంలో అందించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటును నమోదు చేసుకోవచ్చునని తహసీల్దారు సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఐ.పోలవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఐ.పోలవరం, మురమళ్ల పంచాయతీ పితానివారిపాలెంలో రూ.46.20 లక్షలు, రూ.98.39లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారుర. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, చెల్లి అశోక్, కాకర్లపూడి రాజేష్, పిన్నమరాజు శివ, జంపన బాబు, ఏలూరి మూర్తి, మల్లిపూడి రాజు, చెయ్యేటి శ్రీనుబాబు, మద్దిరెడ్డి కుమార్ పాల్గొన్నారు.



ఐ.పోలవరంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

పారిశుధ్య సిబ్బంది జీతాలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చ



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యానాంలో హెచ్ ఆర్ సంస్థ ద్వారా పనిచేస్తున్న సిబ్బందికి ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలపై యానాంలోని అధికారులతో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ చర్చలు నిర్వహించారు. ఎనిమిది నెలలుగా జీతాలు లేకపోతే వారికి జీవనవిధానం ఏవిధంగా సాగుతుందని ప్రశ్నించారు. కేవలం అధికారులు దోరణివల్లే ఇలా జరుగుతుందనీ రాజకీయంగా చేస్తున్న కుట్రని అన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఈ సంస్థ పనిచేస్తుందని అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగుతుందని యానాంలో రాజకీయ ఒత్తిడిలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పుదుచ్చేరిలోని అధికారులకు తప్పుడు నివేదికలను సమర్పిస్తున్నారని ఆరోపించారు. పారిశుధ్య కార్మికులు తక్షణం జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే సిబ్బందితో కలిసి పోరాడతానని హెచ్చరించారు. పారిశుధ్య సిబ్బందితో ఎమ్మెల్యే గొల్లపల్లి మాట్లాడారు. విధులకు హాజరుకాకపోవడంతో అధికారులతో చర్చిస్తామని సిబ్బందికి వివరించారు. మరో పదిరోజుల్లో పూర్తి స్థాయిలో జీతాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామ న్నారు. ప్రస్తుతానికి యాజమాన్యంతో మాట్లాడి మరో రెండురోజుల్లో ఒకనెల జీతం జమచేసేలా మాట్లాడతానని తెలిపారు. తక్షణం విధులలో హాజరుకావాలని సూచించారు.

సర్వే బృందానికి శిక్షణ

ముమ్మిడివరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉపయోగపడే నైపుణ్య శిక్షణ ఇస్తామని ముమ్మిడివరం ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 15 నుంచి 59 సంవత్సరాల మధ్యగల వారి వివరాలు సేకరించి యాప్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి యువతకు ఉపయోగపడే నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి అర్హులను సర్వే ద్వారా గుర్తించి యాప్‌లో నిక్షిప్తం చేస్తారన్నారు. అవసరమైన వారందరూ తమ వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శిక్షణ పొందిన వీవీ దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆర్.ప్రవీణ్‌కుమార్‌లు మండలంలో గణన చేసి ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వండి

మలికిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన వారందరికీ జనవరి నెల నుంచి పింఛన్లు ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కోరారు. జనవరి నెల నుంచి కొత్త పింఛన్లుఇచ్చే విధానాన్ని అమలు చేయాలని,కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు.


ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు


మండపేటలో లక్ష పసుపుకొమ్ములు నోము చేస్తున్న దృశ్యం


రాయవరంలో జరిగిన పడిపూజలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

• దర్శనానికి బారులుతీరిన భక్తజనం • ప్రత్యేక పూజలు, అభిషేకాలు

ఆత్రేయపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో శివుడికి అభిషేకాలు జరిపారు. వేకువజామునే పుణ్యస్నానాలు చేసిన మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ చేశారు. వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయం భక్తులతో సందడి నెలకొంది.

కె.గంగవరం: కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే పుణ్యస్నానాలు చేసి ఆలయాల్లో కార్తీకదీపాలు వెలిగించారు. కుందూరు శివాలయంలో అన్న సమారాధన చేశారు.

మండపేట: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఉప్పల పట్టాబి రామారావు దంపతులు పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాలులో పసుపు కొమ్ములు, తులసి నోములు చేశారు. వేదపండితుల మంత్రాల మధ్య జరిగిన ఈ నోములకు పలువురు ముత్తయిదువులు పూజల్లో పాల్గొని ప్రసాదాలను తీసుకున్నారు. నోములు సందర్భంగా లక్షపసుపు కొమ్ములు, ఆరుబస్తాల గరిస దాన్యం, తులసి మొక్కలకు ప్రత్యేక పూజలు జరిపారు. కైలాసగౌరి వ్రతం చేసిన అనంతరం ముత్తయిదువులకు పసుపు కొమ్ములు, తులసి మొక్కలు, దాన్యం, పసుపు కుంకుమలను అందజేశారు. కార్యక్రమం లో అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొ న్నారు. అనంతరం అన్నసమారాదన చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు: కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో మండపేటతోపాటు మండలంలోని శివాలయాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు శివాలయాల్లో ప్రత్యే క పూజలు చేశారు. పట్టణంలోని అగస్తేశ్వర స్వామి, ఏడిద సంఘమేశ్వర, ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలోని శివాలయం, కేశవరం, అర్తమూరు, తాపేశ్వరం, ఇప్పనపాడు, తదితర గ్రామాల్లోనున్న


కొత్తపేట పలివెల ఉమాకొప్పేశ్వరస్వామికి నారికేళ పంచామృతాభిషేకాలు చేస్తున్న దృశ్యం

శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

రాయవరం: మండలంలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి. కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని చంద్ర ప్రతిష్ఠ శివాలయాలుగా ఖ్యాతిగాంచిన సోమేశ్వరం శ్రీబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. సోమేశ్వరంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. రాయవరం పార్వతీసమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధర్, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో, రాయవరం అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, చెల్లూరు అగస్తేశ్వరస్వామి, లొల్ల ఉమా రామలింగేశ్వర స్వామి, వి.సావరం మాణిక్యాంబ సమేత బీమేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి, నదురుబాద మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు చేశా రు. వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజా కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. గరగ శ్రీనివాసరావు, గరగ సోమన్న స్వామిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొని అయ్యప్పని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు మంత్రి సుభాష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, లీలాకృష్ణలను సత్కరించి వేదాశీర్వచనాలు అందజేసి సత్కరించారు. తొలుతగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం పడిపూజ జరిపారు. సోమేశ్వరం పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్పస్వామి మాలదారులు, భక్తులు పడిపూజలో పాల్గొని పూజలు చేశారు.

రావులపాలెం: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మొదటి సోమవారం శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. వేకువజామునే మహిళలు ఆలయాల్లోనూ కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాల్లో స్వామివారికి లక్షపత్రి పూజ, ప్రత్యేక పూజలు జరిగాయి.

కొత్తపేట: కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. పలివెల శ్రీ ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు అభిషేకాలు ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు స్వామివారి శివలింగానికి నారికేళ పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ఈవో సోమాల శివ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందించారు.

కపిలేశ్వరపురం: కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర, కోరుమిల్లి, తదితర గ్రామాల మహిళలు, భక్తులు వేకువజామునే గౌతమీ నదిలో స్నానమాచరించి ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. కపిలేశ్వరపురం పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు భక్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించారు.


కె.గంగవరం మండలం యండగండి శివాలయంలో అభిషేకాలు చేస్తున్న రుత్వికులు


మండపేటలో అగస్తేశ్వరస్వామికి పాలభిషేకం చేస్తున్న అర్చకులు


రాయవరంలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరం సోమేశ్వరస్వామి


కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ప్రత్యేక అలంకరణలో పార్వతీ సమేత అగస్తేశ్వరస్వామి


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

వాడపల్లి కిటకిట

ఆత్రేయపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం సోమవారం కిటకిలాడింది. అష్టోత్తర పూజలు, నిత్య కళ్యాణాలు జరగ్గా, స్వామి వారికి పలువురు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,62,502 లభించినట్టు ఉప కమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

మద్యం దుకాణాలపై ఫిర్యాదులు


వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో దేవరకొండ అఖిల తెలిపారు. రీ సర్వేపై 3, మద్యం దుకాణాలపై 2, ఆక్రమణల తొలగింపునకు 2, దారిమార్గం కోసం ఒకటి, పంచాయతీలో పారిశుధ్యం కోసం ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు.

బంగారం చోరీ

ఆత్రేయపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బంగారు వస్తువులు అపహరించిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. ర్యాలి గ్రామానికి చెందిన బి.నారాయణరావు దంపతులు 3న అయ్యప్ప స్వామి భోజనాల నిమిత్తం బయటకు వెళ్లా రు. కొంతసేపటి తర్వాత వారు ఇంటికి రాగా తలుపులు తీసి ఉండటాన్ని గమనించారు. బీరువాలోనున్న నాలుగు కాసుల బంగారం చోరీకి గురైనట్టు గుర్తించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూజారిపాలెంనకు పంచాయతీ హోదా కల్పించాలి

కొత్త పేట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం పలివెల గ్రామశివారు పూజారిపాలెం గ్రామానికి ప్రత్యేక హోదా కల్పించి పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ గ్రామాల ప్రజలు సోమవారం ఆర్డీవో శ్రీకర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ శివారు గ్రామంగా ఉన్న పూజారిపాలెం పలివెల గ్రామపంచాయతీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉందని ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయడానికి వీలుగా కావాల్సిన జనబా ఉందన్నారు. అది కాకుండా ఇప్పటికే సరైన రోడ్లు, సరైన డ్రైనేజీ, విద్యుత్‌దీపాలు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు అంతంమాత్రంగానే ఉన్నాయని పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రత్యేక పంచాయతీని ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి కుసుమే సురేష్, కాండ్రేగుల గంగరాజు, పి.సందీప్, వి.రమేష్, టి.వెంకటేష్, నెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట ఆర్డీవో శ్రీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న పూజారిపాలెం గ్రామస్తులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


వాకతిప్ప పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సబ్‌డివిజనల్ ఆఫీసర్ ప్రశాంతి

కపిలేశ్వరపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని రామచంద్రపురం సబ్‌డివిజనల్ ఆఫీసర్ డా. ఎన్. ప్రశాంతి వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని వాకతిప్ప పీహెచ్‌సీని ఆమె విజిట్ చేసారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ విభాగాలైన ఫార్మసీ, లేబరేటరీ, అవుట్‌పేషెంట్స్ ఇన్‌పేషెంట్స్ విభాగం, లేబర్‌రూం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, తదితర అంశాలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేసారు. అన్ని రకాల ఆరోగ్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆరోగ్యకేంద్రం ద్వారా అందించే సేవలు క్వాలిటీగా ఉండాలన్నారు. నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ త్వరలో పీహెచ్‌సీకి వస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డా. పి. చంద్రమౌళి, డా.సీహెచ్ రాకేష్‌కృష్ణచౌదరి, రామచంద్రపురం డివిజినల్ సూపర్‌వైజర్ కమల్ శేషు, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో బిషప్, సూపర్‌వైజర్ కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వనసమారాధన

ఆత్రేయపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలి రామకృష్ణ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 1987-88 పదవ తరగతి విద్యార్థులు అపూర్వ కలయిక నిర్వహించారు. కార్తీక సోమవారం ర్యాలిలోని పూర్వపు విద్యార్థి మల్లవరపు సూరిబాబు ఆధ్వర్యంలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించుకుని ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను స్మరించుకుంటు కుసల ప్రశ్నలు వేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఒకొరికొరు క్షేమసమాచారాలను తెలుసుకున్నారు. అనంతరం కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు.


ఒకేచోట కలిసిన పూర్వపు విద్యార్థులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థి ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు కుందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి గుబ్బల కుందన లక్ష్మీప్రియ ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతలపూడి ఆదినారాయణ తెలిపారు. గతనెల 24న రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో లక్ష్మీప్రియ అండర్ 14 బాలికల విభాగంలో లాంగ్‌జంప్, హైజంప్‌లలో ప్రథమస్థానం పొందింది. దీంతో ఈనెల 5, 6, 7 తేదీల్లో ఏలూరు జిల్లా కైకరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఎంపికైన లక్ష్మీప్రియను ఎంపీపీ పంపన నాగమణి, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, విద్యా కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి వెంకట సూర్యనారాయణ, కూటమి నాయకులు జగతా రమణ, పామర్తి బాబి, పళ్ల చినబాబు, తాడి హరికృష్ణ, మాజీ సర్పంచ్ బత్తుల విజయకుమారి, ప్రధానోపాధ్యాయుడు చింతలపూడి ఆదినారాయణ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు అయినపర్తి వీరవెంకట సత్యనారాయణ తదితరులు అభినందించారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీపీ

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు అందజేసేందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషి చేస్తున్నారని మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌వీఆర్ ఫంక్షన్ హాలులో భారతప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ దివ్యాంగుల సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఏఎల్‌ఐఎంసీవో సంస్థ సౌజన్యంతో జరిగిన దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత ఉపకరణాలు అందజేసేందుకు నిర్వహించిన గుర్తింపు శిబిరంలో ఆయన మాట్లాడారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ ప్రారంభించారు. సదస్సుకు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు చెందిన 400మంది దివ్యాంగులు, వృద్ధులు హాజరుకాగా 350 మంది అర్హులను గుర్తించినట్లు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈడిపి ప్రసన్నకుమార్, రష్మీరంజన్, రాజాబాబులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ్యోతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ మహిళా నాయకురాలు జాస్తి విజయలక్ష్మి కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్లు నమోదుకు ప్రత్యేక కార్యాచరణ


సమావేశంలో మాట్లాడతున్న జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు సమయం దగ్గరపడటంతో ప్రత్యేక కార్యచరణతో ఓట్లు నమోదు చేయాలని కూటమి పార్టీలు నిర్ణయించాయి. ఈ మేరకు సోమవారం కె.గంగవరంలో కూటమి పార్టీల మండల అధ్యక్షులు సమావేశం నిర్వహించారు. ఓట్ల నమోదుకు తక్కువ సమయం ఉన్నందు వలన గ్రామాల్లో కూటమి కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓట్లు నమోదు చేయాలని నిర్ణయించారు. మండల కేంద్రంలో దీనికి సంబంధించిన నెట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి స్వయంగా ఆన్‌లైన్ చేయాలని, గెజిటెడ్ సిగ్నేచర్‌ను తామే చేయించే విధంగా కార్యచరణ చేశారు. గ్రామాల్లో కార్యకర్తలు తక్షణమే పట్ట భద్రులను గుర్తించి ఓటుకు దరఖాస్తులు చేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కె.గంగవరం మెయిన్ రోడ్డులో జనసేన కార్యాలయంలో సేవలు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు అవసరాల రమణమూర్తి, కర్రి చిట్టిబాబు, సలాది రమేష్, ముంగి రమేష్, సలాది శేఖర్, ముద్రగడ శ్రీను పాల్గొన్నారు.

ఆలమూరు ఎంపీడీవోగా రాజు బాధ్యతలు



ఆలమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎ.రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలమూరు ఈవోపీఆర్డీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయనకు ఆలమూరు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పరిషత్ నుంచి ఉత్తర్వు లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆలమూరు ఎంపీడీవోగా పనిచేసిన కె.జాన్ లింకన్ ఉద్యోగ విరమణ కావడంతో రాజును నియమించారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన రాజును మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

'నేత్రదానం ఆదర్శనీయం'


నారాయణమూర్తికి నివాళులర్పిస్తున్న బంధువులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు4: ఇటీవల మృతిచెందిన కొప్పుల నారాయణమూర్తికుటుంబీకులు నేత్రదానం చేయడం ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. సోమవారం రామచంద్రపురం మండలం కొత్తూరులో కొప్పుల నారాయణమూర్తి దశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి చిత్రపటంవద్ద పలువురు నివాళులర్పించి నేత్రదానానికి సహకరించిన కుటుంబీకులను అభినందించారు.

రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. సోమవారం మండలంలోని తాతపూడి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీసర్వేలో భూసమస్యలు ఏమైనా ఉన్నట్లయితే రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం భూ రీసర్వేలో వ్యత్యాసాలు, తదితర సమస్యలపై 62 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.ఎంపీటీసీ జె. వెంకటలక్ష్మి, ఆర్‌ఐ అర్జమ్మ, కార్యదర్శి బ్రహ్మాజీరావు, వీఆర్‌వో ఎస్. శ్రీనివాస్, వెన్నేటి రామకృష్ణ, గ్రామపెద్దలు, రెవెన్యూ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాన్వియ బ్రాహ్మణ సేవా సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

రావులపాలెం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల కాన్వియ బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు దేవరభట్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షులుగా దేవరభట్ల రాధాకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా హనుమంతవఝుల అమరేశ్వరరావు, గౌరవ సలహాదారుగా గోదావరి తాతాలు, అధ్యక్షులుగా పెదసనగంటి సుబ్రహ్మణ్యజగన్నాధ సంతోష్, ఉపాధ్యక్షులుగా జోషులుబాల లోకేశ్, కార్యదర్శిగా గోదావరి వెంకట సత్యసూర్యభద్రం, సహాయ కార్యదర్శిగా దేవరభట్ల సత్యసాయి ఆదిత్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అదే విధంగా కార్తీకవనసమారాధన భోజనాలు నిర్వహించారు.


కాన్వియ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నదృశ్యం

ఉండూరులో 7 కాసుల బంగారం చోరీ

ద్రాక్షారామ,నవంబరు4(ఆంధ్రజ్యోతి):కార్తీక సోమవారం దేవుడి దర్శనానికి ఆలయానికి వెళితో తిరిగి వచ్చేసరికి ఇంట్లో బంగారువస్తువులు దోచేశారు. రామచంద్రపురం మండలం ఉండూరులో జరిగిన ఘటనపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉం డూరు గ్రామానికి చెందిన మేడిశెట్టి లలితాదేవి తెల్లవారు జామున 5 గంటల సమయంలో ఇంటికి తాళంవేసుకుని గ్రామంలో మార్కండేయస్వామి ఆలయానికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి తాళం కప్పబద్దలు కొటిఉంది. లోపలికి వెళ్లి చూసేసరికి ఇంట్లో 60 గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో ద్రాక్షారామ పోలీసులకు పిర్యాదు చేసింది. పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.